క్లుప్తంగా

రెనో కార్ల స్టోర్ ప్రారంభం



రామవరప్పాడు: ఎనికేపాడులో రెనో ఇండియా న్యూ ఆర్ స్టోర్‌ను ఆ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్కో హిడాల్గో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెనో హెడ్ ఆఫ్ సేల్స్ షహల్ శంషుద్దీన్ మాట్లాడుతూ దేశంలో ఆరో న్యూ ఆర్ స్టోర్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. విశాలవంతమైన హాల్, ఐదు వాహనాలను ప్రదర్శించడానికి ప్రత్యేక జోన్ ఉందని చెప్పారు. కార్ల కొనుగోలు, డెలివరీ ఒకే చోట చేసే విధంగా డెలివరీ బేను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నెట్‌వర్క్ హెడ్ దీపక్ రైనా, రీజనల్ మేనేజర్ సేల్స్ సయ్యద్ అజీజుద్దీన్, రీజనల్ మేనేజర్ సతీష్, వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పారిశ్రామికవేత్త సాగి కృష్ణంరాజు సహకారంతో పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.1.90 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ మేరకు చెక్కులను విద్యార్థులకు అందచేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మణికంఠ, పి.అభిరామ్‌లకు రూ.25 వేల చొప్పున, టి.నిషిత, బి.కీర్తన, వి.యశస్విని లకు రూ.10 వేల చొప్పున, మిగతా ఏడుగురికి రూ.2,500 చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. హెచ్‌ఎం కనకదుర్గ, నాయకులు తుమ్మల రామ్‌కుమార్, నర్రాచంటి, విఠల్, మున్వర్, ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల ఉచిత బస్ సర్వీస్ ప్రారంభం



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి స్త్రీశక్తి పథకాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి ఆయన బస్సులో ప్రయాణం చేశారు. యార్లగడ్డ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఐదు కేటగిరీలకు చెందిన బస్ సర్వీస్‌ల్లో ఈ ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. డిపో మేనేజర్ పి.శివాజీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం పక్కన ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంపు

ఆటోనగర్(విజయవాడతూర్పు): గురునానక్ కాలనీలో ఆదివారం యోగ, ఆయుర్వేద నేచురోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు కావూరి అశోక్ తెలిపారు. శిబిరాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ప్రయాణికుల అవస్థలు



కంకిపాడు: లారీల అడ్డగోలు పార్కింగ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలకు అవస్థలు తప్పటం లేదు. వివరాల్లోకి వెళితే.. కంకిపాడు అండర్ పాస్ నుంచి పునాదిపాడు వైపు వెళ్లే మార్గంలో ఓ లారీల యజమాని తనకు చెందిన లారీలను నడిరోడ్డుపైనే నిలుపుతున్నాడు. ఇటీవల ఈ రోడ్డు మార్గాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన రోడ్డుపై లారీలు పార్కింగ్ చేస్తున్నారు. మిగిలిన ప్రదేశం గోతులతో నిండి రాకపోకలు సాగటం లేదు. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవటానికి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. పోలీసులు స్పందించి అనధికారిక పార్కింగ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పీవీపీ సిద్ధార్థలో ఎన్‌సీసీ కేడెట్లు



నున్నలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ రామాంజనేయులు



ఉంగుటూరులో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ సరోజిని



ప్రసాదంపాడు మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



కంకిపాడు పీఎస్‌లో జాతీయజెండా ఎగురవేస్తున్న సీఐ మురళీకృష్ణ

త్రివర్ణ పతాక రెపరెపలు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్వాతంత్ర్య దిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గన్నవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఎగురవేశారు. వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, నాయకులు నిడమర్తి రామారావు, లుక్కా ప్రసాద్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో త్రివర్ణ పతాకాన్ని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ అవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు వెంకటశివయ్య, కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానిక, ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో లైబ్రరీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు జాతీయ జెండాలు ఎగురవేశారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ పతాకావిష్కరణ చేశారు. పార్టీ నాయకులు నాదెండ్ల మోహన్, శేషుమాధవీ, మల్లిఖార్జునరాజు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వీఎస్. సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో విద్యార్థుల త్రివిధ దళాల కవాతు, స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణ, దేశభక్తి నృత్య పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయురాలు జయలక్ష్మి నగదు ప్రోత్సాహలు అందజేశారు.

రామవరప్పాడు వ్యాప్తంగా

రామవరప్పాడు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండా వందనం చేశారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు సర్నాల బాలాజీ గంగారత్నం, రాచమళ్ల పూర్ణచంద్రరావు, రంగారావు జాతీయ జెండాలు ఎగురవేశారు. ప్రసాదంపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ వస్తువులు, పుస్తకాలను సర్పంచ్ గంగారత్నం అందజేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఇన్నర్ వీల్ క్లబ్ నుంచి స్వామినాథన్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



కానూరు వేడుకల్లో దేవభక్తుని చక్రవర్తి, నాయకులు;



మచిలీపట్నంలో జాతీయ జెండాకు గౌరవవందనం చేస్తున్న మంత్రి రవీంద్ర, అధికారులు



కానూరులో జెండా ఎగురవేస్తున్న కిట్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ బర్ల



జాతీయ గీతాలు ఆలపిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



కంకిపాడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు



వీరవల్లిలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు

కృష్ణాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎంపీపీ వడ్లమూడి సరోజిని ఎగురవేశారు. వైస్ ఎంపీపీ కె.చంద్రశేఖర్, సర్పంచ్ కె.వరప్రసాద్, ఎంపీడీఓ ఈ.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు. తేలప్రోలులోని గ్రంథాలయంలో వింత ముత్తారెడ్డి పతాకావిష్కరణ చేశారు. గ్రంథాలయాధికారి కె.కృపానందం, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో వేడుకలు..

విజయవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీఓ బి.విగ్గీన్స్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుగుణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కాటూరి సరళ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ సీహెచ్.రామాంజనేయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్స్, నున్న పాలసొసైటీ వద్ద పాలకేంద్రం అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం వద్ద సొసైటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాతపాడు గ్రామ పంచాయతీలో సర్పంచ్ దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కార్యాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. పి.నైనవరంలో సర్పంచ్ బట్టా సోమయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. వార్డు సభ్యులు, కార్యదర్శి అజేంద్ర పాల్గొన్నారు. అంబాపురం గ్రామ పంచాయతీలో సర్పంచి గండికోట సీతయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యులు జోగా మల్లేశ్వరి, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాపులపాడు మండల వ్యాప్తంగా..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వి.సురేష్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జెండా వందనం చేశారు. వీరవల్లిలోని ప్రాజెక్టు కామధేను ప్రాంగణంలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ హాజరయ్యారు. రేమల్లే, వీరవల్లి, వేలేరు జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు దాతల సహకారంతో నగదు బహుమతులు పంపిణీ చేశారు. వీరవల్లిలోని వాణి విద్యానికేతన్‌లో జరిగిన వేడుకల్లో భారతమాత, జాతీయ నాయకుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

పెనమలూరు పరిధిలో..

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కమిషనర్ షేక్.నజీర్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కానూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి జాతీయ జెండాను ఎగురవేసి, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. యనమలకుదురులో గాంధీ బొమ్మ వద్ద ఎస్‌బీఐ మేనేజర్ మొహమ్మద్ వాహిదా జాతీయ జెండాను ఎగురవేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం, బీసీ సంఘ నాయకుడు కోసూరి నరేష్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు. గ్రీన్ సిటీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఐ.శేషగిరిరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కాలనీ కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, కాలనీ సభ్యులు నరేష్, రవి, కృష్ణపరమాత్మ, మాధవరావు పాల్గొన్నారు. గోసాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. వార్డు సభ్యులు షేక్.పీర్ మహ్మద్, బి.రమణమూర్తి, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంఈవోలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు, మజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్‌ప్రసాద్, తోటకూర ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని చాటాలి

పెనమలూరు: విద్యార్థులు దేశభక్తిని చాటి దేశాభివృద్ధికి కృషి చేయాలని లెఫ్టినెంట్ కమాండర్ కెల్.ప్రణీత్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎన్‌సీసీ కేడెట్లు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.ధదుర్యానాయక్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేడెట్లు మార్చ్ నిర్వహించి, దేశభక్తి గీతాలు ఆలపించారు. సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఉపకులపతి ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కానూరు స్కాట్‌స్ప్రెస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వేడుకలు జరిగాయి. కిట్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌బర్ల జాతీయ జెండాను ఎగురవేశారు. పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈవో జాహ్నవి కొడాలి, ప్రిన్సిపాల్ ప్రతిమా చలసాని, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడులో వేడుకలు

కంకిపాడు: కంకిపాడు వ్యాప్తంగా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కంకిపాడు పట్టణంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. జాతీయజెండా, వైఎస్సార్ సీపీ జెండాలను నాయకులు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, రాష్ట్ర మహిళా నేత రామినేని రమాదేవి, రాష్ట్ర బీసీ నేత నక్కా శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నేతలు పిడికిటి రామకోటేశ్వరరావు, మాదు అరుణ్‌కుమార్, తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, బొడ్డు రాజశేఖర్, మాదు రాఘవేంద్రరావు, కరీముల్లా, మల్లు, జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు పోలీసుస్టేషన్ వద్ద సీఐ జె.మురళీకృష్ణ జాతీయ జెండా ఎగురవేశారు. చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి జాతీయజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.భావనారాయణ జెండా ఎగురవేశారు. కంకిపాడు లాకురోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద గాదంశెట్టి పరమేశ్వరరావు నేతృత్వంలో వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నేతలు భీమవరపు నాగిరెడ్డి, కె.కిశోర్, టి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతుబజారు ప్రాంగణంలో విజిలెన్స్ మానిటరింగ్‌కమిటీ సభ్యుడు తుమ్మలపల్లి హరికృష్ణ జాతీయజెండాను ఎగురవేశారు. పలు పంచాయతీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు.

గన్నవరం రూరల్‌లో వేడుకలు

గన్నవరంరూరల్: మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి జాతీయజెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ షేక్ ఇమామ్ జాతీయ జెండాను ఎగురవేశారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు.



మచిలీపట్నంలో భరతమాత వేషధారణలో..



స్వాతంత్ర్య వేడుకల్లో వాకర్స్



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ యశోద లక్ష్మి, విద్యార్థులు



తాడిగడపలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి



కానూరు సిద్ధార్థ వేడుకల్లో ఎన్‌సీసీ కేడెట్లు



తేలప్రోలు గ్రంథాలయంలో వేడుకలు



గన్నవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, నాయకులు



మచిలీపట్నంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర శకటం ప్రదర్శన

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



రామవరప్పాడులో వ్రతం చేస్తున్న మహిళలు



శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ కమిటీ, శ్రీసత్యసాయి సేవా సమితి గన్నవరం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 150 మంది మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. సాయంత్రం భక్తులచే శ్రీలక్ష్మి సహస్రనామ కుంకుమార్చనలు, శ్రీలలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు, సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడులతో పాటు సమీప గ్రామాల మహిళలు ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలకు పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలను అందజేశారు. వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యాదవుల రామాలయంలో..

స్థానిక యాదవుల రామాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను జరిపారు. తొలుత అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు నందూరి శర్మ నేతృత్వంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు.